క్లుప్తంగా

గంగమ్మకు పూజలు


ప్రత్యేక అలంకారంలో గంగమ్మ తల్లి

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మ తల్లిని ఆదివారం వివిధ ప్రదేశాల నుంచి వచ్చిన భక్తులు పూజలు, అభిషేకాలు చేసి దర్శనం చేసుకున్నారు. ఆలయంలో అమ్మవారికి పట్టు వస్త్రాలు, పూలు, నిమ్మ కాయలతో అలంకరించారు. భక్తులు తమ ముడుపులు చెల్లించుకుని, కానుకలు సమర్పించుకున్నారు. అనంతరం బంధుమిత్రులతో కలిసి విందు భోజనాలు చేశారు. ఆలయ ఆవరణలోని సాయిబాబా, ఆంజనేయ, శివాలయం, వీరభద్రస్వామి ఆలయంలో భక్తులు పూజలు చేశారు. దేవస్థాన సిబ్బంది భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

ఆయుర్వేదంతో ఆరోగ్యం


మందులు పంపిణీ చేస్తున్న వైద్యుడు

పులివెందుల రూరల్: ఆయుర్వేదంతోనే ప్రతి ఒక్కరికీ ఆరోగ్యంగా ఉంటారని ఆయుర్వేద వైద్యుడు హేమప్రచేతన్ తెలిపారు. పట్టణంలోని శ్రీ సంజు ఆయుర్వేద వైద్యశాల, రాజస్థాన్ ఆయుర్వేద ఔషదాలయం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరంలో వివిధ రకాల వ్యాధులకు చికిత్స చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయుర్వేద నిపుణులు మద్దిలేటి ఆచారి, వెంకటరమణయ్య, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

నివాళి


సుధాకర్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి

వల్లూరు (చెన్నూరు): చెన్నూరు మండలం ఓబులంపల్లి వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు సుధాకర్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను కలిసి తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత పులి సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

14న జాతీయ లోక్ అదాలత్


కమలాపురం: స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఆవరణంలో ఈ నెల 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మెజిస్ట్రేట్ లావణ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న లోక్ అదాలత్‌లో భాగంగా కమలాపురం జూనియర్ సివిల్ కోర్టులో కూడా ఈ అదాలత్ నిర్వహిస్తున్నామని తెలిపారు. రాజీకి వీలయ్యే సివిల్, క్రిమినల్, బ్యాంకు కేసులు పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

ప్రమాదాల దారి


పులివెందుల రహదారిలో ఏర్పడిన గుంత

ముద్దనూరు: ముద్దనూరు-పులివెందుల రహదారిలో నల్లబల్లె క్రాస్‌కు సమీపంలో దెబ్బతిన్న రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ రహదారిలో వంక వద్ద రహదారిపై గుంతపడడంతో ప్రయాణికులకు ఇబ్బంది పడుతున్నారు. భారీ వాహనాలే గాకుండా ద్విచక్ర వాహనాలు కూడా ఈ ప్రాంతంలో ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ గుంత వలన వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు సంభవిస్తున్నట్లు ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

మౌలిక వసతులు కల్పించాలి


అంబకపల్లె సబ్ స్టేషన్ కార్యాలయం

పులివెందుల రూరల్: పులివెందుల డివిజన్ పరిధిలోని ఏపీఎస్పీ డీసీఎల్ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న సబ్ స్టేషన్‌లల్లో మౌలిక వసతులు లేక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మరుగుదొడ్లు లేవని వారు వాపోతున్నారు. వివిధ పనులు నిమిత్తం సబ్ స్టేషన్‌కు వస్తే అక్కడ సమాచారం ఇచ్చే వారు లేరని చెబుతున్నారు. డివిజన్ వాప్తంగా మౌలిక వసతులు కల్పించాలని సిబ్బంది కోరుతున్నారు.

ముసురుతో మూగబోయిన మగ్గం


మగ్గం నేస్తున్న మహిళ (ఫైల్)


చేనేత కాలనీలో నిలిచిన మురుగునీరు

- వర్షానికి చేనేత కార్మికులు కుదేలు
- పది రోజులుగా ఉపాధి కరువు

జమ్మలమడుగు : ముసురువానకు మగ్గం మూగవోయింది. మగ్గం గుంతల్లో నీరు నిలిచి నేత పని నిలిచిపోయింది. దాదాపు 10 రోజులుగా వారికి ఉపాధి కరువయ్యింది. నియోజకవర్గంలో అత్యధికంగా చేనేత కార్మికులు మోరగుడి గ్రామంలో ఉన్నారు. ఫెంగల్ తుపాన్ ప్రభావంతో చేనేత మగ్గం గుంతల్లోకి నీరు చేరింది. దీంతో పనుల్లేక నేతన్నల కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి. అసలే అంతంత మాత్రంగా ఉన్న పనులతో అవస్థలు పడుతున్నారు. దీనికితోడు వర్షాలతో ప్రస్తుతం మగ్గం గుంతలన్నీ నీటితో నిండి ఉన్నాయి. వాటిని కార్మికులు బయటకు తోడి పోసినా, రెండు గంటల్లో తిరిగి నీరు నిండుతోందని వారు వాపోతున్నారు.

రోగాల బారిన ప్రజలు

మండల వ్యాప్తంగా అస్తవ్యస్త డ్రైయిన్లతో ఇళ్లల్లోకి వర్షం నీరు వచ్చి చేరుతోంది. ఆక్రమణల వలన, పూడిక తీయకపోవడం వలన డ్రైయినేజీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా తయారైంది. దీంతో మురుగు నీరంతా ఇళ్లల్లోకి రోడ్లపైనే ప్రవహిస్తోంది. గ్రామాల్లో అంతర్గత రోడ్లు గోతులతో అధ్వానంగా ఉండడంతో అవస్థలు పడుతున్న ప్రజలకు రోడ్లపై మురుగునీరు ప్రవహించడం, నిల్వ ఉండడంతో నరకం చవిచూస్తున్నారు. మోరగుడి లోని చేనేత కాలనీలో నీరు నిలిచిపోవడంతో చెత్తా చెదారం కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు అధికమై ప్రజలు రోగాల భారిన పడుతున్నారు.


వర్షానికి దెబ్బతిన్న రోడ్డు

చేనేత కార్మికులను ఆదుకోవాలి



వర్షాలకు పనులు లేక ఇబ్బంది పడుతున్న చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి. మగ్గం గుంతల్లో నీరు చేరడంతో పని సాగక పోవడంతో కుటుంబం పోషణ భారంగా మారింది. చేనేత రుణాలు మాఫీ చేయాలి. చేనేత కుటుంబాలకు పరిహారం ఇవ్వాలి.

శివనారాయణ, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వల్లూరు: కడపలోని 220 కేవీ సబ్ స్టేషన్‌లో ఏర్పడిన సమస్యల కారణంగా మరమ్మతు పనులు చేపడుతున్న నేపథ్యంలో సోమవారం వల్లూరు, చెన్నూరు మండలాల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చెన్నూరు, వల్లూరు మండలాల విద్యుత్ శాఖ ఏఈలు రామలింగారెడ్డి, డానియల్ జోసెఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

చింతకొమ్మదిన్నె : కడప - రాయచోటి రోడ్డులోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల (అటానమస్)లో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల స్థాపించి 14 సంవత్సరాలు పూర్తయిందని, కళాశాలలో విద్యను పూర్తి చేసుకుని వివిధ రంగాల్లో స్థిరపడిన విద్యార్థులందరూ ఇలా సమావేశం కావడం మంచి పరిణామన్నారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన అధ్యాపకులను ఆహ్వానించి సన్మానించారు. చదువు అనంతరం వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ వాళ్లందరూ వచ్చి ఒకరికొకరు కలుసుకుని మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు. ఈ సమావేశంలో కో ఆర్డినేటర్ డాక్టర్ కే.వి.నాగేశ్వరరెడ్డి, కళాశాలకు చెందిన వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


సమ్మేళనంలో పాల్గొన్న ప్రొఫెసర్లు, పూర్వ విద్యార్థులు, సిబ్బంది

బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి


సమావేశంలో ఐక్యత చాటుతున్న విశ్వ బ్రాహ్మణ సంఘం నాయకులు

జమ్మలమడుగు: బీసీలకు చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని విశ్వకర్మ విశ్వ బ్రాహ్మణ అభ్యుదయ సంఘం నాయకుడు లక్షుమయ్య ఆచారి కోరారు. ఆదివారం పట్టణంలోని మునిరెడ్డి కాంప్లెక్స్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభాలో బీసీలే ఎక్కువ మంది ఉన్నా.. చట్ట సభల్లో వారికి సరైన ప్రాధాన్యత లేదని పేర్కొన్నారు. ఓబీసీ మహిళలకు చట్ట సభల్లో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు ఆధ్వర్యంలో ఉద్యమించడటానికి శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బడిగించాల చంద్రమౌళి, నాగేంద్ర ఆచారి, లక్షుమయ్య, వీరభద్ర, రామాచారి, నాగార్జున , బాలకృష్ణ, మోహన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నడవలేక పోతున్నాను.. కరుణించరా సారూ..


అంగవైకల్యంతో బాధపడుతున్న చంద్రారెడ్డి

ముద్దనూరు: పుట్టుకతోనే అంగవైకల్యం పొంది.. నడవలేక పోతున్నాను.. నన్ను కరుణించండి సారూ.. అంటూ ఓ దివ్యాంగుడు అధికారులకు మొరపెట్టుకుంటున్నాడు. తనకు త్రిచక్ర బ్యాటరీ వాహనాన్ని మంజూరు చేయాలని దివ్యాంగుడు వెన్నపూస చంద్రారెడ్డి అధికారులను వేడుకుంటున్నారు. మండలంలోని కొర్రపాడు గ్రామానికి చెందిన చంద్రారెడ్డికి 76 శాతం అంగవైకల్యం ఉన్నట్లు వైద్యులు ధ్రువీకరించి పత్రం కూడా ఇచ్చారు. కట్టె పట్టుకుని నడవలేకపోతున్నానని, ప్రతి పనికి ఇతరులపై ఆధారపడి జీవిస్తున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. అంగవైకల్యంతో అవస్థలు పడుతున్నానని వాపోయాడు. బ్యాటరీతో నడిచే త్రి చక్ర వాహనాన్ని మంజూరు చేస ఆదుకోవాలని చంద్రారెడ్డి విజ్ఞప్తి చేస్తున్నారు.

నయనం ప్రధానం


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

జమ్మలమడుగు: సర్వేంద్రియానాం.. నయనం ప్రధానమని, ప్రతి ఒక్కరూ కంటి ఆరోగ్యం కోసం జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని డాక్టర్ ఎంఎల్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎస్పీ డిగ్రీ కాలేజీ ప్రాంగణంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యంలో ప్రతి ఒక్కరికి కంటి చూపు తగ్గుతుందన్నారు. దీంతో ఇబ్బందులు పడుతుంటారని పేర్కొన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగేశ్వరరెడ్డి, విశ్రాంత ఉద్యోగి మాధవ గోపాల్‌రెడ్డి, మానవతా సేవాసంస్థ అధ్యక్షుడు బీటీ నరసింహారెడ్డి, పెన్షనర్ సంఘం అధ్యక్షుడు దేవదానం, పార్థసారథి, ఓబుల్‌రెడ్డి, మస్తాన్ రెడ్డి, సభ్యులు సంజీవ రాయుడు, రామచంద్రారెడ్డి, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలమల్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో 144 సెక్షన్

ఎర్రగుంట్ల : ప్రజల శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని ఎర్రగుంట్ల మండలంలోని కలమల్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 6 నుంచి 12వ తేది వరకు 144 సెక్షన్ విధించినట్లు ఎస్ఐ తిమోతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నలుగురి కంటే ఎక్కువ మంది గుమి కూడటం, ఆయుధాలు లేదా ప్రమాదకర వస్తువులను తీసుకెళ్లడం చేయరాదన్నారు. ప్రదర్శనలు, నిరసనలు చేపట్టరాదని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కేంద్రంపై ఒత్తిడి తేవాలి

బద్వేలు అర్బన్ : కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం రాష్ట్రంలోని ఎంపీలు పార్లమెంటు సమావేశాల్లో కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డీవైఎఫ్ఎం జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన డీవైఎఫ్ఐ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు విషయంలో కేంద్రం వైఖరి దారుణంగా ఉందని, పార్లమెంటు సమావేశాల్లో ఎంపీలు అడిగిన ప్రశ్నకు కడప ఉక్కు సమస్య తమ దగ్గర లేదని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి ప్రకటించడం దారుణమన్నారు. వలసలు, కరువుతో అల్లాడుతున్న రాయలసీమ ప్రాంతంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటైతే లక్షలాది మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. సమావేశంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌షరీఫ్, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

దాతలు సహకరించాలి


భవన నిర్మాణం కోసం శుభ్రం చేయిస్తున్న రాజు తదితరులు

పులివెందుల రూరల్: పట్టణంలోని నూతన బస్టాండ్ సమీపంలో హౌసింగ్ కాలనీకి వెళ్లే దారిలో స్నేహిత అమృత సేవా సమితికి రాజశేఖర్ గుప్తా దానంగా ఇచ్చిన స్థలంలో నిర్మించే భవన నిర్మాణం కోసం స్వచ్ఛందంగా దాతలు ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించాలని స్నేహిత అమృత సేవా సమితి అధ్యక్షుడు రాజు కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. త్వరలో భూమి పూజ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, కృష్ణారెడ్డి, మహేశ్వరరెడ్డి, శ్రీకాంత్, రవి, శివ, మహమ్మద్, సురేష్, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విజయదుర్గమ్మ కల్యాణం

కడప కల్చరల్: కడప నగరంలోని విజయదుర్గాదేవి ఆలయంలో ఆదివారం అమ్మవారి కల్యాణం వైభవంగా జరిగింది. ప్రతి నెలా రెండో ఆదివారం విజయదుర్గ, మల్లికార్జునుల కల్యాణోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా తొలుత ఆలయ ప్రాంగణంలో వేద పండితులు ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు జరిపారు. స్వామి, అమ్మవారి ఉత్సవ మూర్తులను వధూవరులుగా అలంకరించి కల్యాణ వేదికపై కొలువు దీర్చారు. అనంతరం కల్యాణం వైభవంగా సాగింది.

ప్రతి ఒక్కరూ భగవద్గీతను పఠించాలి



మాట్లాడుతున్న భక్తి వికాస్ స్వామి మహారాజ్

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రతి ఒక్కరూ భగవద్గీత పఠించాలని ఇస్కాన్ గురువు శ్రీమద్ భక్తి వికాస్ స్వామి మహారాజ్ పేర్కొన్నారు. ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ చేస్తున్న పర్యటనలో భాగంగా ఆదివారం కొర్రపాడు రోడ్డులోని ఇస్కాన్ మందిరానికి స్వామిజీ వచ్చారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ భగవద్గీత చదవడంతో మంచి చెడు విచక్షణా జ్ఞానం తెలుస్తోందన్నారు. తాను లండన్‌లో పుట్టి 20 ఏళ్ల వయసులో హరే రామ.. హరే కృష్ణ మహా మంత్రంతో సంపూర్ణంగా కృష్ణచైతన్యాన్ని స్వీకరించడం జరిగిందన్నారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా కులం, మతం, పేద-ధనిక అనే తారతమ్యం లేకుండా ప్రజలంతా అంతులేని శారీరక, మానసిక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. వారి జీవితాల్లో వెలుగు నింపి ప్రశాంతమైన మానవ జీవిత పరిపూర్ణత్వాన్ని తెలియచేయాలనే ఉద్దేశంతో ప్రపంచ వ్యాప్తంగా పర్యటిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా పాల్గొన్న భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. సోమవారం ఉదయం 8 గంటలకు ఇస్కాన్ మందిరం, సాయంత్రం 6 గంటలకు బొల్లవరంలోని ఆంజనేయస్వామి విగ్రహ సమీపంలో భగద్గీత ప్రవచనాలు చేస్తారన్నారు. దీక్షా గురువు త్రిదండి సన్యాసి భక్తివికాస స్వామి, శిక్షా గురువు మదురేసు పాల్గొన్నారు.

నేడు ఓబులంపల్లెలో రెవెన్యూ సదస్సు

చింతకొమ్మదిన్నె : చింతకొమ్మదిన్నె మండలంలోని కె.ఓబులంపల్లి గ్రామంలోని మండల ప్రజా పరిషత్ పాఠశాలలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. అలాగే డిసెంబర్ నెల 10వ తేదీన రాయల పంతులపల్లి, 11న పెద్ద కాంపల్లె, 12న కృష్ణాపురం, 13న విశ్వనాథపురం, 16న చిన్నకాంపల్లె, 17న తాడిగొట్ల, 18వ తేదీన కొప్పర్తి, 19న ఇప్పపెంట, 20న కొలుములపల్లె, 21వ తేదీన ఉటుకూరు, 23న మామిళ్లపల్లె, 24వ తేదీన చింతకొమ్మదిన్నె, 26న పబ్బాపురం, 27న బుగ్గలపల్లె, 28న కమ్మవారిపల్లె, 30వ తేదీన రుద్రయ్యగారిపల్లె, 31న అప్పరాజుపల్లె, జనవరి 2న పాపాసాహెబ్ పేట, జనవరి 3న బుగ్లేటిపల్లె, 4వ తేదీన బాలు పల్లె, 6న జమాల్ పల్లె, జనవరి 7వ తేదీన చెర్లోపల్లె గ్రామాలకు సంబంధించిన భూసమస్యలపై రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

శనగ పంటకు తెగులు.. అన్నదాతకు దిగులు

పెద్దముడియం: తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు భూమిలో తేమ శాతం ఎక్కువై సాగు చేసిన శనగ పంటకు తెగులు సోకింది. దీంతో వైరస్ సోకిన శనగ పంట తెల్లగా మారిపోతోంది. దీంతో శనగ సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. వర్షాలు భాగా పడ్డాయి, పంటలు బాగా పండుతాయని ఆశపడిన రైతులకు ఆకాల వర్షాల వలన వచ్చిన తెగుళ్లతో ఆశలు అడియాశలు అయ్యాయి. వ్యవసాయ అధికారులు పంటలను పరిశీలించి సలహాలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.


తెల్లగా మారిన ఆకులు


తెగులు సోకిన శనగ పంట

బీసీల సంక్షేమానికి కృషి


బీసీ ప్రజా చైతన్య సమాఖ్య నూతన కమిటీ

ప్రొద్దుటూరు కల్చరల్ : బీసీల సంక్షేమానికి కృషి చేస్తానని బీసీ ప్రజా చైతన్య సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు పేర్కొన్నారు. స్థానిక జమ్మలమడుగు బైపాస్ రోడ్డులోని అలంకార్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ది బీసీ ప్రజా చైతన్య సమాఖ్య నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ రాజకీయ పార్టీలు తమ పార్టీకి బీసీలే వెన్నముక అని చెబుతూ రాజ్యాధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకోవడంలేదన్నారు. బీసీలను రాజకీయ నాయకులు ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారేగానీ, వారికి రాజకీయాల్లో సముచిత స్థానం కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

నూతన కమిటీ ఎంపిక

ప్రొద్దుటూరు బీసీ ప్రజా చైతన్య సమాఖ్య నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొర్రా రామాంజనేయులు, సమాఖ్య ప్రధాన కార్యదర్శిగా దేవేంద్రుడు, కోశాధికారిగా మడకా సంటెయ్య, ఉపాధ్యక్షులుగా వేల్పుల భాస్కర్‌యాదవ్, కొత్తపల్లి శ్రీను, సుంకర వేణు, జీసీ పుల్లయ్య, కార్యదర్శిగా భాస్కరరావు, పోసా ఆదినారాయణ, సహాయ కార్యదర్శులుగా తుపాకుల చౌడయ్య, పరమేశ్వరరావు, గౌరవ సలహాదారులుగా గజ్జల చంద్రమౌళి, జయరాం యాదవ్, మల్లిఖార్జున, మునిస్వామి, నాగయ్య, శ్రీనివాసమూర్తి ఆచారితోపాటు పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. బీసీ కులసంఘాల పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

వక్ఫ్ ఆస్తులను కాపాడాలి

ప్రొద్దుటూరు క్రైం : వక్ఫ్ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత ముస్లింలందరిపై ఉందని ముస్లిం వెల్ఫేర్ అసోసియేసియన్ ప్రెసిడెంట్ ఖాజామొహిద్దీన్ తెలిపారు. ముబారక్ ఫంక్షన్ హాల్‌లో వక్ఫ్ సవరణ బిల్లు-2024పై ఆదివారం చర్చా వేదిక నిర్వహించారు. ఖాజామొహిద్దీన్ మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తుల ద్వారా వచ్చే ఆదాయంతో పేద ముస్లింల విద్య, వైద్య, సంక్షేమం మెరుగుపరుచుకోవచ్చని చెప్పారు. గెజిట్‌లో చూపబడిన ఆస్తులు వక్ఫ్ బోర్డు ఆధీనంలో లేవని, ఆస్తులు అన్యాక్రాంతమయ్యాయని తెలిపారు.

భౌతిక వనరుల వినియోగంపై అవగాహన

కడప కల్చరల్: భౌతిక వనరుల వినియోగం తగ్గించేందుకు కృషి చేయాలని పర్యావరణ మిత్ర సమూహం ప్రతినిధులు భరత్ కుమార్ పుష్పరాజ్, శివ భాస్కర్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ, పచ్చదనం అభివృద్ధి, మానవ వనరుల సద్వినియోగం, భౌతిక వనరుల వినియోగాన్ని తగ్గించడంపై ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మొక్కల పెంపకం పట్ల అభిరుచి పెంచడానికి, వాటి ద్వారా విజ్ఞానం పెంచుకొని ఆనందం, ఆరోగ్యం పొందడానికి కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు మొక్కల పెంపకానికి అనువైన విత్తన ప్యాకెట్లను సీడ్స్ కిట్ ఫర్ కిడ్స్ పేరిట అందజేశారు. ఈ కార్యక్రమంలో షకీల, గోవింద్ రెడ్డి, సుష్మా రెడ్డి, కిరణ్, అలేఖ్య, సుప్రియ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులు, తల్లిదండ్రులతో నిర్వాహకులు